


# చీమ

కూచి సాయిశంకర్

'బెల్లం ఒంటికి పూసుకుంటే 'చీమ' కుట్టదటే వెర్రి పీనుగా! ఫో - పోయి ఆ ఒళ్లు కడుక్కో - ఊఁ... వెళ్లు... తొందరగా!'

చిన్ననాటి అమ్మమాట ఓ తెరలా మనోనేత్రం ముందు కదిలింది. నిజంగా 'చీమ' చురుకుదనం నరనరానా అంటింది. ఇప్పటికీ 'చీమ' జ్ఞాపకం ఓ పచ్చబొట్టు నాకు.

**** ***** *****

'సుబ్బమ్మ పిన్ని' నిజంగా 'తిట్టే నోరూ - తిరిగే కాలూ' లాంటిదే. అప్పు డెప్పుడో 'పిన్ని' అంఖణాల నోటి దురుసుకీ - ఫెళుసుకీ బెదిరి కామోను.... కాస్త ముందుగానే గడపదాటి కొండెక్కాడు పిన్ని మొగుడు. వంశాంకురంగా ఓ కొడుకు ఉన్నాడా! తగుదునమ్మా అని ఏకపక్షంగా 'వేళ్లూ - గళ్లూ' చూసి నట్టింట్లోకి ఓ కోడలు పిల్లని కోరి తెచ్చుకుంది. అత్యంత ప్రాధేయపూర్వకంగా అమరిన సంబంధం అది.

చిత్రం ఏమిటంటే! పిన్ని నోటికి ఝడిసి - తన ఒంటెత్తు పోకడకి మరికాస్త రూపూ - ఊపూ ఇచ్చి ఆ 'కోడలు జాణ' కాస్తా త్వరలోనే మొగుడి మొహాన ఓ 'దరఖాస్తు' అంటించి - చక్కా పోయింది.

'వస్తే నా దగ్గరకు రా - లేకపోతే! మీ అమ్మతో పడి నీ చావు నువ్వు చావు' అనేది ఆ సారాంశం.

ఏడాకు లెక్కువ చదివిన పిన్నికి మరో మూణ్నాలుగు ఆకులు ఎక్కువ చదివినది రావటం మామూలు విషయమే! ఔను, అబ్బురంగా పెరిగిన పిల్ల కదూ! పైగా పదో తరగతి డింకీ కొట్టినా - ఆరిందా సోకులకు ఒక చారెడు ఎక్కువే -

అసలు లోకానికి విరుద్ధంగా... కొడుకు కాస్తా పెళ్లాంతో వేరుపోకుండా 'తల్లినే అంటిపెట్టుకోవడం' - ఊరూ వాడా ఎనిమిదో వింతై కూర్చుంది.

"వీడేం పిల్లాడండీ! పెళ్లై - పెళ్లాం వచ్చినా తల్లి పట్టు వదలని 'అమ్మకూచి'..." అనేది సుప్రభాత సంగీతంగా అగ్రహారం పాట -

అన లీ మాట మనసుకి కాదు కదా - కనీసం చెవికి సైతం పట్టలేదు వాడికి.

వాగిన నోళ్లు అలసిపోయాయి విసిగిపోయాయి.

వాడి బతు కలా సాగిపోతోంది.. వేరు కుంపటిలా -

కొడుకు పెళ్లి కాస్తా పెడాకులు అవటం చూసి కూడా 'సుబ్బమ్మ పిన్ని'కి చీమ కుట్టినట్టు కూడా లేదు - దీనికి 'హాశ్చర్య'పోవాల్సింది ఏదీ లేదు.

ఎందుకంటే అసలుకి మా పిన్ని ఓ 'గండుచీమ.'

**** **** ****

'ఓసి నీ దాక్షిణ్యకం కూలా! అప్పచెల్లెళ్ల చీర పెట్టుబళ్లలో గడి తేడా చూసి మరీ పెట్టడం - ఇంటా వంటా లేదు. ఉంటే నిజాయితీగా నూరు పైసల నిజంలా ఉండాలి - ఒక రకం చీర పెట్టాలి. అంతేకాని ఇలా చీటీ గుడ్డలూ - అస్తవ్యస్తం పన్లు నాకు సుతరామూ నచ్చవు. నేనేం దేబిరించలేదు - వాపిరిగొట్టు కాదు - వీరు కాకపోతే మరోహరూ, చాటంత లోకంలో చీరే పెట్టేవారుండరా ఏవిషీ... హూ!' సుదీర్ఘం తీస్తూ అరిచే ఆ కంచుకంఠం తాతాచార్ల ముద్రంత నిక్కచ్చి.

ఆ గొంతు సుబ్బమ్మ పిన్నిది!!

పుట్టి బుద్ధెరిగాక 'చీమ' అరుపు స్పష్టంగా వినడం తొలిసారి.

'రావులారి గుడి దగ్గర ఆ కోదండం కొడుకు వస్లేవిటమ్మా! గుడి పూజారి కూతురు... అదే గుర్రపంత పిల్ల.. ఆ రాలుగాయికి ఈ భడవ.... తగుదునమ్మా అని పువ్వులు కోసిస్తాడా! అవ్వ!! రవ్వంత సిగ్గూ - ఎగ్గూ ఉండక్కర్లా - అరికాలి తడి ఇంకా ఆరనైనా లేదు - ఆ ప్రభలాంటి పిల్లని యాగీ చెయ్యడానికి ఎన్ని గుండెలమ్మ వాడికి - వెధవ్వేషం!'

'అప్పటికీ ఈడూ - వైనం వట్టడంలేదు. ఈ పిల్ల దెయ్యాలకి. నా కసలు ఆదినుండీ సుతరామూ ఈ నడతలు పట్టవు. లేకపోతే రెక్కలు ముక్కలు చేసుకొని నా కొడుకుని అలా పెంచేదాన్నా.. ఇప్పటికి చూడండి వాడికి నా మాట వేదవాక్కు, లక్ష్మణరేఖ, చెరుకుపానకం' ఈ గట్టు తెగిన ప్రవాహవేగ ప్రసంగం 'సుబ్బమ్మ పిన్ని' వైనం అని మళ్లీ మళ్లీ చెప్పాల్సిన పనుండదు.

ఇది ప్రతి పూటా కొత్త బిచ్చగాడి పొద్దెరగని తంతు.

అసలు ఆవిడగారి చూపుకి - మాటకి ఎదురుపడి తప్పించుకున్న వారు మా గోదారి జిల్లాల్లోని మా బంధుకోటిలోనే కాదు, ఇతరుల్లో కూడా ఎవరూ లేరు. ఇది పచ్చి బండ నిజం.

ఆవిడగారి 'ఇంగితం' వెనుక 'రహస్య పదార్థం' బహుశా ఆవిడ్ని సృష్టించిన బ్రహ్మకైనా రేణువంతైనా తెలుసో లేదో అనేది నా అనుమానం.

ఇంతకీ కథేవిటంటే...

పోనీలే! ఊరూ వాడా, ఎవరెవరికో జరిగేవీ ... చూడనివీ, వినవివీ కదా ప్రత్యక్షంగా.. అనీ అప్పుడప్పుడు నల్లపూసలా కనపడే 'సుబ్బమ్మ పిన్ని' విషయంలో కాస్తంటే కాస్త చిటికెడు జాలి చూపించామా - ఏకుమేకై, మొక్క మానై.. దిక్కూచి మాకేసి తిరిగింది... పికిలిపిట్ట చూపుల తీతువు కూతలా!

ఇంట్లో! ఆయనా, నేనూ, పిల్ల లిద్దరూ, ముఖ్యంగా మా అత్తగారూ ఏదో 'సాలా - తవ్వా'గా కుటుంబాన్ని ఉన్నంతలో హాయిగా నడుపుకుంటున్నాం. చిన్న చిన్న ఉరుములూ - మెరుపులూ మధ్య మధ్యలో ఉన్నా అది ఆ పూటకి సరి. మళ్లీ రేజుకి ఆప్యాయతలూ - ఆనందాలూ అవే అల్లుకునేవి మాధవీ లతల్లా మా ఇంట.

పోనీ! అటు భర్తపోయీ - ఇటు కొడుకు కాపరం చెడీ ఏదో పాటుపడుతోంది - చుట్టం చూపుగా వచ్చింది. పెద్దది! అని రానిచ్చామా, అది అలవాటై - సల్లమందులా, రెండు రాత్రుల సామెతగా, శివరాత్రి నుండి సంకురాత్రి చందంగా 'సుబ్బమ్మ పిన్ని' రాక నిజంగా మా కాపరానికి 'చీమ కుట్టటవే' అయ్యింది.

చీమకుట్టు ముచ్చట ముదురుతోంది.

'నాకు స్టీలు గ్లాసు కాఫీ - అన్నీ ఉడిగిన అత్తవని నీకు ఇత్తడి గ్లాసు కాఫీ' అంటూ అత్తగార్ని మొదటిసారి కుట్టింది చీమ.

కాదు - కాదు - మా సుబ్బమ్మ పిన్ని!

ఎంత లేదన్నా సైను పంచతో సర్దుకోక, పూర్వ సువాసినీ వాలకానికి తొమ్మిది నంబరు వెంకటగిరీ సన్నంచు జరీ చీరా... నామోషీగా లేదూ! నాకు మాత్రం కరణంగారి కోడ లీ విషయం ప్రస్తావించినప్పుడు తల కొట్టేసినట్లైంది.' కొంత జాగా తీసుకుని చీమ నన్నూ 'పీకింది.'

అన్నిటికంటే విపరీతం!

మా చంటివాళ్ల సాజాకు అల్లరిని కూడా 'సపాలం' అంటేలా చిత్రించి మా వారి పద్ద 'శైౖ' మని అడడం. ఆ వంకనే బుడి బుడి దీర్ఘాలు తీస్తూ, తన కష్టాలన్నీ ఏకరువు పెడుతూ, భాగా దూరం చుట్టరికం దగ్గరగా కలిపి, ఆ మిషని పదో పరకో దండుకోవటం ఉత్త కాకి లక్షణం.... కాదు చీమ లక్షణం.

పోనీ అలాగైనా ఊరుకుంటుందా అంటే పంచాయతీ రేడియోలా మళ్లీ కల్పించుకుని 'వాళ్ళి దూబరా మనిషి నీ మొగుడు! మగాడికి ఏమాత్రం పొదుపు చేసే లక్షణం లేకపోతే కొంప గుండవై ఉన్నప్రాణాలన్నీ హరీ అంటాయి. అప్పుడు ఏ దరీ లేక గోదావరి వెతుక్కోవాలిస్సి' అంటూ నా భర్తని నా దగ్గరే విమర్శిస్తుంది.

అబ్బబ్బబ్బ! ఈ 'చీమ' విపరీత పోకడకి అంతూ, దరీ లేకుండా పోయింది.

లేచింది మొదలు పడుకోబోయేదాకా 'మధ్యతరగతి సంసార నావ'ని ఉన్నంతలో హాయనిపించేలా నడుపుకోడానికి ప్రయత్నం చేసుకునే మా కుటుంబానికి మా 'పిన్ని చీమపోరు' ప్రతిక్షణం చురుక్కు... చురుక్కులా ఉంది.

అపార్థాలకు తావీయం కాబట్టి మేం సరే! అదే ఆవాళ్లగ విడిపోయే మనస్తత్వా లున్న ఇళ్లలో సుబ్బమ్మ పిన్ని లాంటి చీమ చేష్ట - పరాకాష్ఠకి చేరదూ?!

ఈ ముదనష్టపు చీమ విషయంలో అందరం కలసి ఓ ఆలోచన చెయ్యాలి - లోతుగా చెయ్యాలి.

***** ***** *****

'ఏవిటోయ్! ఇవేళ్టి కా బెల్లం తరగడం పూర్తి ఔతుందా! లేదా? అవతల నాకు నైవేద్యానికి వేళ మించి పోతోంది... ఊ... కానీ' పూజ గదిలోంచి వచ్చిన మా వారి కేకకి 'చీమ సుబ్బమ్మ పిన్ని' పట్టులోంచి జారి స్మృతిలో కొచ్చాను.

అప్పట్లో సరైన సమయానికి ఉపాయం చేసి, కాస్తంత శ్రమైనా, కుటుంబం కలసికట్టుకోసం సుబ్బమ్మ పిన్ని చీమకుట్టుకి దూరంగా మారాం కాబట్టి... అమ్మయ్య! హాయిగా ఉంది ప్రాణాలకి.

తేలూ - జెర్రీ - పాముఃల విషయంలో నిర్భయం కాస్త అటూ ఇటూ అయినా పరవాలేదు. కానీ! మన మధ్యే ఉంటూ అల్పప్రాణిగా నటిస్తూ... సందు దొరికితే మన ఏకాగ్రతని క్షణకాలమైనా తప్పించే చీమ... విధి వక్రిస్తే పై వాటి కన్న ప్రమాదమైంది! ఇది మా స్వానుభవం.

ఇలాంటి చీమ విషయంలో చాలా నిఖార్సుగా ఉండాలి.

ఏమో! ఏ పొరబాటైనా జరిగి, గ్రహస్థితి తారుమారై సుబ్బమ్మ పిన్ని చీమకుట్టు 'పాము కాటులా' మా మనసుల్ని విరిచేస్తే, దోస తోట లాంటి పచ్చని మా సంసారం మొదలంటా మాడిపోయేదే!

అయినా ఇప్పటికీ 'చీమ' విషయంలో మా దో నిశ్చితాభిప్రాయం. ఇవేళా - రేపూ కాదు ఎల్లవేళలా 'చీమల' విషయంలో మాత్రం మేం 'పారా హుషార్.'

●

## సబ్బు ఖర్చుండని చోటు



ఒక దీవిలో నేల పూర్తిగా 'సబ్బు'లా ఉపయోగపడుతుంది. అంటే అక్కడ మట్టిని సబ్బులా ఉపయోగించవచ్చు. ఈ మట్టి సబ్బులో ఉండే తత్వాలు, గుణాలు కలిగి ఉండి, అక్కడి ప్రజలు స్నానానికీ, బట్టలు ఉతుక్కోవటానికి కూడా ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇంతకీ ఆ దీవి పేరు ఏమిటోనని కనురుకోకండి! 'ఎజియన్ సీ'లోని [అర్జెంటీనా] 'గ్రీక్ ఐలండ్'..

సేకరణ : ఎస్. లక్ష్మి విద్య [మద్రాసు]